వందరోజుల పాలనపై ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర - కే.కోటపాడు: వంద రోజులు పాలనలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఆదివారం కే.సంతపాలెంలో ఎంపీడీవో ఎస్.అప్పలరాజు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. వంద రోజుల్లో ప్రభుత్వం నిర్వహించిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు. అనంతరం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 23వ తేదీ మాడుగులలో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరంలో అత్యధిక రోగులు పాల్గొనాలని ఎంపీడీవో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటారని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కె.కోటపాడు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్థానిక రెల్లి వీధికి చెందిన సిహెచ్ అప్పారావు కుటుంబ సభ్యులకు వైద్య ఖర్చుల నిమిత్తం స్థానిక బీజేపీ నాయకురాలు పైలా అమ్మాజీ 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. పేద కుటుంబానికి చెందిన అప్పారావు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని స్థానిక రెల్లి సంఘం నాయకులు కోరారు.

పట్టపగలే షిర్డీ సాయి ఆలయంలో చోరీ

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో, ప్రధాన రహదారిలో గల షిర్డీ సాయిబాబా ఆలయంలో పట్టపగలే దొంగలు పడ్డారని నిర్వాహకులు, పోలీసులు తెలిపారు. ఈ చోరీలో సుమారు లక్ష రూపాయలు విలువ గల సాయి ఆభరణాలు దొంగలించబడ్డాయని పోలీసులు గుర్తించారు. స్థానిక ప్రేమ సమాజంకు ఆనుకొని ఉన్న ఆలయంలో బాబా వెండి కిరీటంతో సింహం బొమ్మకు తాపడం చేసిన వెండిని దుండగులు పట్టుకుపోయారు. సమీపంలోని సిసి కెమేరాలను పరిశీలించి నిందితులను పట్టుకుంటామన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం శివారు అన్నవరం వెంకయ్యగారి పేటలో సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ఆరుగురు విజేతలుగా నిలిచారు. వారిలో ప్రథమ స్థానంలో పొంతపల్లి సంతోషి నిలవగా, రెండవ స్థానం లో పొట్నూరు లావణ్య, మూడవ స్థానంలో గొన్నాబత్తుల హైమ, నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో పుల్లేటి దేవిశ్రీ, కండల లక్ష్మి, గూటాల రామ లక్ష్మిలు నిలిచారు. ఆరుగురు విజేతలకు గ్రామ పెద్దలు సమక్షంలో బహుమతులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కార్యసిద్ధి గణపతి దేవస్థానంలో భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర - చోడవరం: రాష్ట్రంలోని స్వయంభూ దేవాలయాలన్నింటిలో అత్యంత మహిమాన్వితమైన, చరిత్ర ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా చోడవరం స్వయం భూ కార్య సిద్ధి గణపతి దేవస్థానంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా భక్తులు, ప్రజలు, ప్రముఖులకు ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. చోడవరం, అనకాపల్లి, విశాఖ, హైదరాబాద్ వంటి నగరాల నుండి భక్తులు విశేషంగా తరలి వచ్చారు. లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి చలపతిరావు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.వి.వి.సత్యనారాయణ మూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి చలపతిరావు, ఆలయ చైర్మన్ ఉప్పల సతీష్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పసుమర్తి సాంభశివరావు, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - రాంబిల్లి: మండలం అప్పన్నపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామానికి చెందిన శేశెట్టి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కమలాకర్ పురిపండా, డాక్టర్ హేమంత్ కుమార్, వివి మాధురి, డిమిలి పీహెచ్‌సీ ఆరోగ్య పర్యవేక్షణాధికారి ధనరాజు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కీళ్ల నొప్పులు, పక్షవాతం, నరాల బలహీనత, చర్మ సమస్యలు, పైల్స్, స్త్రీల సమస్యలు, పలు దీర్ఘకాల సమస్యలతో బాధపడుతున్న 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామస్తులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వాహకుడు అప్పారావును స్థానికులు అభినందించారు.

రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్‌గా నారపురెడ్డి పద్మావతి ఎంపిక

విశాలాంధ్ర - పాయకరావుపేట: 3020 డిస్ట్రిక్ట్‌కి తుని రోటరీ క్లబ్ నుండి నూతనంగా నారపురెడ్డి పద్మావతిని అసిస్టెంట్ గవర్నర్‌గా ఎన్నుకున్నారు. నారపురెడ్డి పద్మావతి పాయకరావుపేటలో రోటరీ క్లబ్ సెక్రటరీ, ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పద్మావతి చేసిన సేవలను గుర్తించి ఆమెకు అసిస్టెంట్ గవర్నర్ పదవి బాధ్యతలు అప్పగించారు. 70 సంవత్సరాలు చరిత్ర ఉన్న తుని రోటరీ క్లబ్ నుండి మొట్ట మొదటి మహిళ అసిస్టెంట్ గవర్నర్‌గా పాయకరావుపేట నుండి నారపురెడ్డి పద్మావతి ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. నారపురెడ్డి పద్మావతి ప్రస్తుతం పాయకరావుపేట పంచాయతీ వార్డు సభ్యురాలిగా ఉన్నారు.

నేడు ధర్మవరంలో హోం మంత్రి అనిత పర్యటన

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో ధర్మవరం గ్రామంలో సోమవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పర్యటించనున్నారు. ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో భాగంగా ఆమె గ్రామంలో పర్యటిస్తారని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. అందులో భాగంగా ఆ గ్రామంలోని మండల ప్రత్యేక అధికారి సుబ్బలక్ష్మి అధ్యక్షతన మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. మంత్రి పర్యటన విజయవంతం చేయాలని గ్రామంలో పరిశుభ్రతగా ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయకుమార్, డిప్యూటీ డీఈవో అప్పారావు, మండల టీడీపీ అధ్యక్షులు అమలుకంటి అబద్ధం తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువలో మృతదేహం

విశాలాంధ్ర - అనకాపల్లి: మండలంలోని కొండకొప్పాక గ్రామంలో నాగమ్మ బ్రిడ్జ్ దగ్గరలో ఏలేరు కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు రూరల్ ఎస్సై సత్యనారా యణ తెలిపారు. సుమారు 35 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం పూర్తిగా పాడైపోయి గుర్తించలేని విధంగా ఉందన్నారు. మృతదేహం వివరాలు తెలిసినవారు రూరల్ పోలీస్ సంప్రదించాలని ఆయన కోరారు.

నిరుపేదల నివాసాలపై బడాబాబుల జులుం

- భూ బకాసురులకు కొమ్ము కాస్తున్న ఎమ్మెల్యే
- అనకాపల్లి ఎం.పి. సి.ఎం.రమేష్ ఆదేశాలు బేఖాతరు
- నిరుపేదల ఇళ్లు కూల్చివేతపై ఉత్తుత్తి విచారణలతో కాలయాపన చేస్తున్న అధికారులు

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా చోడవరం విఘ్నేశ్వరుని గుడి ఎదురుగా ప్రధాన రహదారిలో నివాసముంటున్న ఓ నిరుపేద కుటుంబం అన్నపురెడ్డి వరలక్ష్మి ఇంటిని పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ మారిశెట్టి సాగర్, పంచాయతీ అధికారులు కూల్చివేసి ఆదివారం నాటికి 29 రోజులు గడిచినను అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎటువంటి న్యాయ సహాయం చేయలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితులను పరామర్శించిన అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్ పేదలకు న్యాయం చేయాలని చేసిన ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. కూల్చివేసిన సంఘటనలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి (డి.పి.ఎల్.ఓ) ఎస్.ఎస్.ఎస్.ఎన్. మూర్తి, స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు. వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు చోడవరం మేజర్ పంచాయతీ ఈ.ఓ. నారాయణరావుతో కలసి సంఘటన ప్రదేశాన్ని పరిశీలించారు. ' డ్రైనేజీల ఏర్పాటు కోసం' అంటూ పంచాయతీ అధికారులు ఇచ్చిన సమాధానం మేరకు అధికారులు పడగొట్టిన బాధితుల ఇంటిని పరిశీలించారు. సంఘటన స్థలంకు సంబంధించిన దస్తావేజులు సమర్పించవలదిందిగా బాధితులను కోరారు. విచారణ అనంతరం ఉన్నతాధి కారులకు నివేదిస్తామని, తదుపరి ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని తెలిపి రోజులు గడుస్తున్నను, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంది. నిరుపేద బి.జె.పి. కార్యకర్త అయినటువంటి బాధితురాలు వరలక్ష్మి అనకాపల్లి ఎం.పి. సి.ఎం.రమేష్‌కు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారుల్లో స్పందన మొదలైంది, కానీ బాధితురాలికి న్యాయం జరగలేదు. ఈ సంఘటనలో ప్రధాన పాత్రధారుడు, సూత్రధారుడు అయిన రియల్ ఎస్టేట్ వ్యాపారి(భూ బకాసురుడు) మాజీ ఉప సర్పంచ్ సాగర్, పంచాయతీ కార్యదర్శి నారాయణరావులను రక్షించేందుకు చోడవరం కూటమి టీడీపీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు శతవిధాలా ప్రయత్నిస్తున్నారని బాధిత వర్గాలు, అమాయక పేద ప్రజలు ఆరోపిస్తున్నారు. చోడవరం పట్టణం నడిబొడ్డులో ఓ నిరుపేద మహిళ కుటుంబానికి అన్యాయం జరిగి 29 రోజులైనను స్థానిక ఎమ్మెల్యే రాజు పట్టించుకోపోవడమే దీనికి నిదర్శనమన్నారు. సి.పి.ఐ. జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏ.పి. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, అనుబంధ ప్రజా మహిళా సంఘాల మద్దతుతో బాధితుల నిరసనలు కొనసాగుతున్నాయి. ముందస్తుగా ఎటువంటి నోటీసు, సమాచారం లేకుండా మాజీ ఉప సర్పంచ్ సాగర్, పంచాయతీ కార్యదర్శి నారాయణరావులు పేదలపై నేటికీ దౌర్జన్యంకు పాల్పడుతున్నారని, వారి వలన తమకు ప్రాణహాని ఉందని బాధితులు వాపోతున్నారు. తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాల తరపున సి.పి.ఐ., ప్రజా మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల అనైతిక చర్యలు వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ శక్తులు కొమ్ము కాస్తున్నారని స్థానికులు, బాధిత కుటుంబాలు ఆగ్రహంతో పాటు ప్రాణాలు అరచేత పట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు.

వర్గీకరణ ఆలోచన మానుకోవాలి: దళిత సంఘాల డిమాండ్

విశాలాంధ్ర - అనకాపల్లి: వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టులో ఇప్పటికే రివ్యూ పిటిషన్ దాఖలు చేశామని ఈ నెల 24న మొదట వాయిదా ఉందని అంబేద్కర్ గ్లోబల్ మిషన్ అధ్యక్షులు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసిన భయ్యే మల్లయ్య విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అనకాపల్లి కోడిగంటి గోవిందరావు సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము వేసిన రివ్యూ పిటిషన్‌పై ఈనెల 24న సుప్రీంకోర్టు మొదటి వాయిదాకు పిలిచారన్నారు. సుప్రీంకోర్టులో తమకు అనుకూలంగానే తీర్పు వస్తుందని రాజ్యాంగంలో లేని వర్గీకరణ సూచిస్తూ ఎలా తీర్పునిస్తారని తాము పిటీషన్‌లో పేర్కొన్నామన్నారు. ఈ విషయమై ప్రభుత్వాలు ఎటువంటి తొందరపాటు చర్యలు తీసుకోకుండా పాత పద్ధతిలోనే వర్గీకరణ లేకుండానే, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్లోబల్ మిషన్ ప్రధాన కార్యదర్శి సువర్ణ రత్నంకు సంఘాల నాయకులు సన్మానాలను చేశారు. అనంతరం దళితులపై దాడులు ఆపాలంటూ దళిత డాక్టర్‌పై దాడిని నిరసిస్తూ నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రం వ్యాప్త ఆందోళన చేపడతామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విజిలెన్స్ ఎండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు, మార్తి అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాల మహానాడు రాష్ట్ర నాయకులు సియాద్రి శ్రీను, అంబేద్కరిసమే పునాది నాయకులు రాజాన బుజ్జి, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు రాహుల్, డివిఎంసి సభ్యులు మరువాడ ఈశ్వరరావు, మరియమ్మ, గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ కన్వీనర్ లోవచందు, ఎస్సీ, ఎస్టీ జిల్లా ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు పల్లా బాబ్జి, కటారి దేవుడు, ఉడత రాముడు, గుంటూరు సురేష్, మాజీ ఎంపిటిసి ఉడత బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కెమిక్ డ్రగ్స్ ఫార్మా కంపెనీలో ప్రమాదం

- కార్మికునికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - పరవాడ: జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని కెమిక్ డ్రగ్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు గాయపడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. భవనం పైకప్పు నిర్మాణ పనుల్లో భాగంగా సేఫ్టీ బెల్ట్ మారుస్తుండగా అదుపు తప్పి పశ్చిమ బెంగాల్ కు చెందిన ఐవిల్ షేక్(21) అనే కార్మికుడు కుప్పకూలి పోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని విశాఖలోని ఓ ఆసుపత్రికి తరలించారు. శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి కంపెనీ యాజమాన్యం బయటకు పొక్కనీయలేదు. తోటి కార్మికుల సమాచారంతో ఆదివారం సాయంత్రం బయటకు తెలిసింది. విషయం తెలుసుకున్న ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన కంపెనీ ఎదుట విలేకరులతో మాట్లాడారు. ప్రమాదం జరిగినప్పటికీ కంపెనీ యాజమాన్యం గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. భద్రత ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. గాయపడ్డ కార్మికుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, పూర్తిగా కోలుకునే వరకు జీతం చెల్లించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

ప్రజల మధ్యనే 100 రోజుల పండుగ

ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

విశాలాంధ్ర - అచ్యుతాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌లు రాష్ట్రం సంక్షోభంలో ఉన్నా సంక్షేమాన్ని అందించి, ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజల మధ్యనే 100 రోజులు పండగ జరుపుకుంటున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు.

ఆదివారం మండలంలో కొండకర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడారు. కొండకర్ల ఆవను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దామని, నిరుద్యోగ యువతకు అండగా ఉంటూ మెగా డీఎస్సీలో 16437 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం, స్థానిక సంస్థలకు రూ. 1452 కోట్లు ఇచ్చి పంచాయతీలకు ప్రాణం పోశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, బిజెపి కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, లాలం భవాని, ప్రభుత్వాధి కారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా రాష్ట్ర పాలన

- దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే మంచి ప్రభుత్వంగా రాష్ట్ర ప్రజల ఆదరాభిమానాలను కూటమి ప్రభుత్వం పొందుతూ ఉందని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం 32వ వార్డులోని నేరెళ్ల కోనేరు కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధి సమతూకంగా పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్లు 3000 నుండి 4000 రూపాయలు ఇచ్చిందని, అంగవైకల్యం వారికి 6 వేలు, బెడ్ రిడెన్ వారికి 15 వేలు వరకు పింఛను పెంచారని అన్నారు. అన్న క్యాంటీన్‌ల ద్వారా 5 రూపాయలకు అల్పాహారం, భోజన సదుపాయం కల్పిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి తన ఉనికి చాటుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిరంతరం ప్రజల్లో ఉండి ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సౌత్ ఇన్చార్జి సుధాకర్, సౌత్ జనసేన ఇన్చార్జి శివ ప్రసాద్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కందుల నాగరాజు, కూటమి వార్డ్ అధ్యక్షులు అర్జున్, దుర్గా రెడ్డి, కూటమి శ్రేణులు రాజ్య లక్ష్మి, తెలుగు లక్ష్మి, శాలివాహన, డిప్యూటీ కలెక్టర్ సత్యలత, జోన్ 4 కమిషనర్ నాయుడు, ఏపీడీ పుణ్యవతి, పీవో రవనమ్మ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మామిడిలోవలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - ఆనందపురం: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం మండలంలోని మామిడిలోవ గ్రామంలో గల కమ్యూనిటీ హాల్ వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు విశాఖపట్నం జోన్ 4 ఆధ్వర్యంలో సాయి భక్తులు బలిరెడ్డి పెంటయ్య, బలిరెడ్డి అప్పల రాము, కోరుకొండ సంతోష్ ఆధ్వర్యంలో ఈ రక్త దాన శిబిరాలు నిర్వహించగా 70 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వీరిలో ముగ్గురు యువతిలు రక్తదాన చేయడం విశేషం. ఈ రక్తదాన శిబిరాన్ని శ్రీ సత్యసాయి సేవా సంస్థలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేవాదళ్ జాయింట్ కోఆర్డినేటర్ డి.రాఘవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ఎంతోమందికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని ఆయన అన్నారు. ఈ రక్తాన్ని ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ విశాఖపట్నం డాక్టర్ ఎస్.దివ్యవాణి బృందం సేకరించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు విశాఖ జోన్ 4 కోఆర్డినేటర్ మానాపురం సత్యసాయి కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు జిల్లా మెడికల్ కోఆర్డినేటర్ బి.సాయికుమార్, వివిధ భజన మండల కన్వీనర్లు ఏ.దేవుడు బాబు, డి.అప్పలరాజు, కోరాడ తమ్మి నాయుడు, ఆనందపురం భజన మండలి సేవాదళ్ కోఆర్డినేటర్ కొట్యాడ లక్షణమూర్తి, తాటి చెట్లపాలెం భజన మండలి యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి హయాంలో కల్లుగీత కార్మికులకు న్యాయం

విశాలాంధ్ర - భీమిలి: బ్రాందీ షాపుల్లో పది శాతం వాటా ఇవ్వడంపై కల్లుగీత సహకార సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. భీమిలి నియోజకవర్గం లో భీమిలి నేరెళ్ల వలస కాలనీ కమ్యూనిటీ హాల్లో కల్లుగీత సహకార సంఘాల అధ్యక్షులతో చిట్టిబోయిన రాము అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య నాయకులు టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, యాత సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంగటి రాము, భీమిలి డివిజన్ నాయకులు రీసు రమణ, గండి బోయిన రమణ, కాకర ఎల్లారావు హాజయ్యారు. అంగటి రాము మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం గీత కార్మికులకు ఎంతో అన్యాయం చేసిందని తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమి విజయం చెంది చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నారా చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన 100 రోజులకే కల్లుగీత కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం బ్రాందీ షాపుల్లో 10 శాతం షాపులను కేటాయించడం హర్షనీయమన్నారు. భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు భీమిలి పరిసర ప్రాంతాల అభివృద్ధి కొరకు ఎంతో కృషి చేస్తున్నారని, గీత కార్మికులకి కావలసిన సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళు ుంటే కొంతమంది తప్పుడు ప్రచారాలు చేయడం చాలా బాధాకరమని అన్నారు.

86, 87 వార్డులలో నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ 87వ వార్డు పరిధి కనితి హైస్కూల్ వద్ద గల 2000 కె.ఎల్ ఈఎల్ఎస్ఆర్ఈ ఓవర్ హెడ్ ట్యాంకు వద్దగల నీటి సరఫరా పైపులైన్ల మరమ్మత్తులు, 86వ వార్డు ఉడా ఫేస్-1 ట్యాంకు వద్ద నందు గల ప్రధాన నీటి సరఫరా వాల్వుల యొక్క మర మ్మత్తు పనులు చేపట్టుచున్నందున సోమవారం 86, 87వ వార్డు నివాసి తులకు మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలి పారు. కావున 86, 87వ వార్డు ప్రజలు తాగునీటికి కలుగు అసౌకర్యానికి మంచినీటి సరఫరా విభాగం జి.వి.ఎం.సి వారికి ప్రజలు సహకరించాలని కోరారు.